# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 22-06-2016**

ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, విద్యుత్, సింగరేణిలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించడంతో పాటు అన్ని చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ రంగం సంస్థలను కాపాడడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల కనీస బాధ్యత అని సిఎం అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు బాగుపడితే అంతిమంగా ప్రజలే బాగుపడతారని సిఎం అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఆర్టీసీ, విద్యుత్ అంశాలపై క్యాంపు కార్యాలయంలో బుధవారం సిఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యానారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ, జెన్ కో సిఎండి డి. ప్రభాకర్ రావు, ఎస్పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి, ఆర్టీసీ ఎండి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో ఆర్టీసీ, విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం, ఆయా సంస్థల ఆదాయ-వ్యయాలు, వస్తున్న నష్టాలు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. గత ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడవం వల్ల ఆర్టీసీ, విద్యుత్ సంస్థలు కునారిల్లిపోయాయనే విషయం వెల్లడయింది. ముఖ్యంగా ఆర్టీసీ ఎప్పుడు మూత పడుతుందా అనే భయాందోళన ఉండేది. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ఫలితంగా విద్యుత్, ఆర్టీసీ సంస్థలు కోలుకున్నాయి. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్నాయి. అయినప్పటికీ ఆర్టీసీ, విద్యుత్ సంస్థలు ఇంకా నష్టాల్లోనే కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నష్టాల నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం, ఉద్యోగులు, ప్రజలు సహకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల ఊబినుంచి

బయట పడేసేందుకు ప్రభుత్వం చేయాల్సినంత సహాయం చేస్తుందని, అదే సమయంలో ప్రజలు కూడా కొంత భారం మోయాల్సి వస్తుందని వెల్లడించారు.

విద్యుత్ సంస్థల నష్టాలకు నాలుగు కారణాలు

1. తెలంగాణలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యుత్ సరఫరాను మెరుగుపర్చేందుకు ఖర్చుకు వెనకాడకుండా అదనపు సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల నిర్మాణం చేపట్టింది. దీనికోసం తెలంగాణలోని రెండు డిస్కమ్ లు, ట్రాన్స్ కో కలిపి రూ.2,144 కోట్ల అప్పులు చేశాయి.
2. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు తెలంగాణలో కోతల్లేని విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనికోసం ఉత్పత్తికి మించిన విద్యుత్ అవసరమవుతున్నది. గత ఏడాది జలవిద్యుత్ (హైడల్ పవర్) కూడా ఉత్పత్తి కాలేదు. ఫలితంగా స్వల్పకాలిక పవర్ పర్చేస్ అగ్రిమెంట్లు (పిపిఎ)తో విద్యుత్ కొనాల్సి వచ్చింది. దీనికోసం గత ఆర్థిక సంవత్సరంలో రూ.2700 కోట్లు ఖర్చు పెట్టాయి విద్యుత్ సంస్థలు.
3. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా మెరుగుదల కోసం అధికారులు, ఉద్యోగులు కూడా చిత్తశుద్ధితో పనిచేశారు. అందుకే ప్రభుత్వం వారి వేతనాలు పెంచింది. పెంచిన వేతనాల భారం కూడా విద్యుత్ సంస్థలపై పడింది.
4. రైతులకు పగటి పూట 9 గంటల కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విద్యుత్ సంస్థలు రూ.2,400 కోట్లు ఖర్చు చేసి సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, ఇతర కార్యక్రమాలు చేపట్టింది.

ఈ నాలుగు ప్రధాన కారణాల వల్ల విద్యుత్ సంస్థలపై చాలా ఆర్థికభారం పడిందని, దీన్నించి గట్టెక్కించడానికి విద్యుత్ సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తుందని సిఎం హామీ ఇచ్చారు.

సామాన్యులపై భారం పడకుండా విద్యుత్ చార్జీల పెంపు

రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై పలు ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సామాన్య ప్రజలపై, గృహ వినియోగదారులపై ఏమాత్రం అదనపు భారం పడకుండా చార్జీలు పెంచుకోవడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ సంస్థలను అవకాశం కల్పించారు. వంద యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగించే వారికి చార్జీలను పెంచవద్దని సిఎం ఆదేశించారు. వంద యూనిట్ల కన్నా ఎక్కువ వినియోగించే గృహ విద్యుత్ వినియోగదారులకు కూడా స్వల్పంగానే పెంచాలని సూచించారు. రాష్ట్రంలో 86 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లుంటే, అందులో 60 లక్షల కనెక్షన్లు 100 యూనిట్ల లోపు విద్యుత్ వాడేవి కావడం గమనార్హం. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వల్ల ఎక్కువ మంది వినియోగదారులపై పెంపు భారం పడదు.

పరిశ్రమలకు సహేతుక పెంపు

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు పరిశ్రమలకు అనుకూలమైన విధానం అవలంబించడంతో పాటు, ఐటి కంపెనీలు, పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీనివల్ల కూడా విద్యుత్ సంస్థలపై భారీగా భారం పడింది. ఈ భారాన్ని కొంత మేర పంచుకోవాలని తెలంగాణ విద్యుత్ అధికారులు పరిశ్రమల నిర్వాహకులను కోరారు. ఇటీవలే వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు సరఫరా చేస్తున్న విద్యుత్ పదిశాతం పెంచడం తమకు ఆమోద యోగ్యమే అని యజమానులు చెప్పారు. ఇదే విషయాన్ని అధికారులు సిఎంకు తెలిపారు. అయితే పరిశ్రమలకు కూడా పదిశాతం కాకుండా, ఏడు శాతంలోపే పెంపుదల ఉండాలని సిఎం సూచించారు.

ఆర్టీసీని కాపాడేందుకు ప్రభుత్వ చర్యలు

1. గత ప్రభుత్వాలు ఆర్టీసీని అసలు పట్టించుకోలేదు. ఫలితంగా ఆర్టీసీ నష్టాలు అంతకంతకూ పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆర్టీసీకి రూ.2,275 కోట్ల అప్పు ఉంది. ప్రతీ నెలా నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఆర్టీసిని నడపడానికి చివరికి ఉద్యోగుల కో ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.180 కోట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఈ దుస్థితి నుంచి కాపాడడం కోసం ఆర్టీసికి బడ్జెట్లోనే నిధులు

కేటాయించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రతీ నెల రూ.75 కోట్ల చొప్పున ప్రభుత్వ సాయాన్ని ఆర్టీసికి అందిస్తున్నారు.

2. అర్బన్ ట్రాన్స్ పోర్టేషన్ ఆర్టీసికి గుదిబండలా మారింది. ఎక్కువ నష్టాలు దీనివల్ల వస్తున్నాయి. ఈ దుస్థితి నుంచి గట్టెక్కించడానికి హైదరాబాద్ నగరంలో తిరిగే బస్సుల ద్వారా వచ్చే నష్టాన్ని క్రాస్ సబ్సిడి ద్వారా జిహెచ్ఎంసి భరించే విధాన నిర్ణయం తీసుకున్నారు.
3. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనాల్సిన అవసరం ఉంది. 1100 బస్సులు పూర్తిగా పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి కొనడంతో పాటు మరో 100 బస్సులు కొత్తవి కొనాల్సి వుంది. మొత్తంగా 1200 బస్సులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం రూ.300 కోట్ల వరకు ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించింది.
4. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారి వేతనాలు పెంచింది. డీజిల్ రేట్లు కూడా హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి.
5. విద్యార్థుల బస్సు పాసులతో పాటు, వివిద రాయితీల కింద ఇచ్చే బస్ పాస్ లపై అయ్యే వ్యయం దాదాపు రూ.500 కోట్లు ఉంటుంది. ఈ డబ్బును కూడా ప్రభుత్వం ఆర్టీసీకి ఎప్పటికప్పుడు చెల్లించాలని నిర్ణయించింది.

పల్లె వెలుగులో ఒక్క రూపాయే పెంచండి

ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజల సహకారం కూడా అవసరమని, చార్జీలు పెంచాలని ఆర్టీసీ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. సామాన్యులు, పల్లె ప్రజలు ఎక్కువగా ప్రయాణించే పల్లె వెలుగు బస్సుల్లో 30 కిలో మీటర్ల లోపు ఒక్క రూపాయి, 30 కిలో మీటర్ల పైన (ఎంత దూరమైనా) రెండు రూపాయలు మాత్రమే ధర పెంచాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులకు సూచించారు. సగం మంది ఆర్టీసీ ప్రయాణికులు పల్లె వెలుగు బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు కాబట్టి, పేదలకు రవాణా సౌకర్యం కల్పించే బాధ్యత ప్రభుత్వం మీద ఉంటుందని, అందుకే పల్లె వెలుగు చార్జీలను పెద్దగా పెంచవద్దని సిఎం చెప్పారు. మిగతా బస్సుల్లో కూడా పదిశాతం మించకుండా చార్జీలు పెంచాలని సిఎం సూచించారు.

## సింగరేణిపై దృష్టి పెట్టండి

తెలంగాణలో అతి ముఖ్యమైన ప్రభుత్వ రంగ సంస్థయిన సింగరేణిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహం రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. త్వరలోనే సింగరేణిపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, అన్ని అంశాలను చర్చించనున్నట్లు వెల్లడించారు.

## చార్జీల పెంపుపై రేపు తుది నిర్ణయం

తెలంగాణలో ఆర్టీసీ, విద్యుత్ చార్జీల పెంపు విషయంలో ప్రభుత్వ నిర్ణయం గురువారం వెలువడే అవకాశం ఉంది. ఈ రెండు శాఖల అధికారులు తమ ప్రతిపాదనలు సిఎంకు వివరించగా, సిఎం కూడా పలు సూచనలు చేశారు. సామాన్యులపై భారం పడని విధంగా పెంపు ఉండాలనే సిఎం సూచనల మేరకు అధికారులు తుది నివేదిక తయారు చేయనున్నారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి ఇతర ప్రాంతాల్లో పర్యటనల్లో ఉండడంతో గురువారం పెంపు విషయంలో తుది నిర్ణయం తీసుకుంటారు.

**సిపిఆర్ఓ టు సిఎం**